
# అక్షరాభ్యాసము ప్రశ్నోత్తర మాలిక




"శ్రీ గురుభ్యో నమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ

www.gurujnanam.org

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| Track1 | అక్షరాభ్యాసం & అక్షరం అంటే ఏమిటి? | 1 |
| | అక్షరాభ్యాసం. భూతలిపి అంటే ఏమిటి? వాక్కు దశలు. | 3 |
| Track 2 | కుండలినీ దేవతలు, అక్షర దేవతలు | 9 |
| | అక్షరాభ్యాసం. మాహేశ్వర సూత్రములు - 1 to 4 | 14 |
| Track 3 | మాహేశ్వర సూత్రములు - 5, to 14 సూత్రములు హల్లులు, దృశ్యమానజగత్ | 19 |
| | మాతృకావర్ణములు | 24 |


gurujnanam.org

## అక్షరాభ్యాసం & అక్షరం అంటే ఏమిటి?

1.వ్యాస పూర్ణిమలు అని వేటినంటారు?


జ. ఆషాడ మాస పూర్ణిమ, శ్రావణ పూర్ణిమ, భాద్రపద పూర్ణిమ, ఆశ్వీయుజ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ. వీటిని వ్యాస పూర్ణిమలంటారు.

2. కృష్ణ ద్వైపాయనుడిని వ్యాసుడని, నారాయణుడిని వ్యాసుడని అంటారెందుకు?

జ. కృష్ణ ద్వైపాయనుడు తన జ్ఞానాన్ని విస్తరిమ్పచేసినవాడు కనుక వ్యాసుడని పేరు. నారాయణుడు విశ్వాన్ని తన శక్తితో విస్తరింప చేసినవాడు కనుక నారాయణుడిని వ్యాసుడంటారు.

3. మనకు ప్రవక్త ఎవరు?

జ. ఋషులిచ్చిన జ్ఞానాన్ని ఏకీకృతం చేసి ఇచ్చినది వ్యాసుడు. భారతీయుల ధర్మానికి ఒక ప్రవక్త అంటూ లేడు, కాని ఒక ప్రవక్త గురించి మాట్లాడాలి అంటే వ్యాస భగవానుని గురించి చెప్పుకుంటాము.



4. వ్యాసుడు అంటే అర్ధం ఏమిటి?


జ. విస్తరించి చెప్పేవాడు అని ప్రధాన అర్ధం.

5.అభ్యాసము అంటే అర్ధం ఏమిటి?

జ. practice, అనుష్టానము. సాధన, exercise.

6. వైద్య శాస్త్రం లో చరకుడు, శుశ్రుషుడు వైద్యానికి వేటిని వాడేవారు?

జ. మణి, మంత్రం, ఔషధం వాడేవారు. మంత్రప్రయోగాలతో వైద్యం ఎలా చేయవచ్చో చెప్పారు. eg చరక సంహితలో విష్ణు సహస్ర నామ పారాయణం చేయు విధానం చెప్పారు. జ్యోతిష్య శాస్త్రం లో గ్రహ నక్షత్ర ఉపాసనా, పూజావిధానం ఉంది.



7.అక్షరాభ్యాసంలో ప్రధమంగా పిల్లలకు ఏ అక్షరాలను దిద్దిస్తారు?

జ. ఓనమః శివాయః సిద్ధం నమః. దీనినే ఓనమాలు దిద్దించుట అంటారు.

8.అక్షరం అంటే అర్ధం ఏమిటి?

జ. అక్షరం అంటే జీవుడు, పరమాత్మ, శబ్దములు అని అర్ధం.

9.అక్షర క్రమం కూర్చినది ఏభాషలో?

జ. సంస్కృత భాషలో. ఉదాహరణ శ్రీనాధ మహాకవి అంటాడు

|| జనని సంస్కృతంబు సకల భాషలకును, దేశ భాషలందు తెలుగు లెస్స
జగతి దల్లికంటె సౌభాగ్య సంపద, మెచ్చు టాడుబిడ్డ మేలు గాదె?|| by—వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామం నాటకం.

10.భగవంతుడిని చేరుకోవడానికి మార్గం ఏది?

జ. భగవంతుడిని చేరుకోవడానికి మాట, మనస్సు మార్గం.

11.అక్షరాలన్నీ ఎందులో ఉన్నవి?

జ. అక్షరములు అహం లో ఉన్నవి. అ నుండి హ వరకు ఉన్నవి అక్షరములు. వీటిని మాతృకలు అంటారు.

Copyright@gurujnanam.org

12. అక్షరాలు పరమార్థానికి ఎలా వాడతారు?

జ. అక్షర శక్తిగల మంత్రములు పారమార్థికం లో వాడతారు.

13. అక్షరాలు వ్యవహారానికి ఎలా వాడతారు?

జ. మన నిత్యావసరములను తీర్చుకొనుటకు వాక్య రూపంలో అక్షరాలను వాడతాము.

14. వేదంలో అక్షరాల ఉచ్చారణ కూర్పును ఏమంటారు?

జ. ప్రాతిసాఖ్యం.

15.పురుషోత్తముడంటే అర్థం ఏమిటి ?

జ. క్షరమైన ప్రకృతిని, అక్షరమైన జీవుని ఎవరు నియమిస్తున్నాడో అతడు పురుషోత్తముడు.

16.పరమార్థానికి, వ్యవహారానికి మాట, మనస్సు మార్గము. అలాంటి మాట, మనస్సుతో భగవంతుడిని ఎలా పట్టుకోగలం?

జ. తపస్సు, అనుష్ఠాన బలం, ఉపాసనతో ఉన్న మనసు భగవంతుడిని పట్టుకోగలదు.

## అక్షరాభ్యాసం. భూతలిపి అంటే ఏమిటి? వాక్కు దశలు

17. అక్షరాభ్యాసం అంటే ఏమిటి?

జ. అక్షరము, అక్షరానికి మూలమైన అక్షరుడైన పరమాత్మను తెలుసుకోవడం.

18. భూత లిపి అంటే ఏమిటి?

జ. పంచ భూతాత్మకమైన ఆకాశ వర్ణములు, వాయు వర్ణములు, అగ్ని వర్ణములు,

జల వర్ణములు, పృథ్వీ వర్ణములను భూత లిపి అంటారు. వర్ణములంటే అ నుండి క్ష వరుకూ ఉన్న అక్షరములు.

19.దివ్య సంగీత యోగి ఎలా అవగలరు?

జ. స్వర శాస్త్రంలో అక్షరదేవతలు, స్వర దేవతలు ఉంటారు. ఒక రోజుకు గ్రహానికి స్వరానికి అనుబంధం ఉంది. స్వర దేవతను, గ్రహానికి ప్రీతిపాత్రమైన దేవతను ఆరాధన, ఉపాసన చేస్తే దివ్య సంగీత యోగి అవగలడు.

20. ఏ అక్షరాన్ని నిత్య శబ్దం అంటారు?

జ. అకార శబ్దం. అ....................

21. అక్షర సిద్ధులు అని ఎవరిని అనాలి?

జ. అక్షర దేవత అనుగ్రహం పొందినవారిని అక్షర సిద్ధులు అంటారు.

22. అక్షర ఉచ్చారణ ఎన్ని విధాలుగా విభజింపబడింది?

జ. 10 విధములు. కంఠ్యములు, తాలవ్యములు, మూర్ధనములు, దంత్యములు, ఓష్ట్యములు, అనునాసికములు, కంఠతాలవ్యములు, కంఠోష్ట్యములు, దంతోష్ట్యములు, నాసిక్యము.

23. || శబ్ద బ్రహ్మ నిష్ఠాతః పరబ్రహ్మాధి గచ్ఛతి || అంటే అర్ధం ఏమిటి?

జ. శబ్ద బ్రహ్మంలో నిష్టత కలిగినవాడు పరబ్రహ్మం పొందగలడు.

Copyright@gurujnanam.org

24. అద్వైత సిద్ధి అని దేనినంటారు?

జ. అక్షర పరబ్రహ్మం, అక్షర జీవుడు రెండు అక్షరములు. క్షరమైన దానితో తాదాప్యం వదిలేసి, అక్షరుడైన జీవుడు, అక్షరుడైన బ్రహ్మంతో కలిస్తే అద్వైత సిద్ధి లభిస్తుంది.

25. నాదం అక్షరంగా ఎప్పుడు మారుతుంది?

జ. వెన్నుపాములో ప్రవహించే పరాశక్తి నాద పూర్వ రూపం. ఆ చైతన్య శక్తి ఉదరంలోని జఠరాగ్నితో కలిసి శబ్దం పుడుతుంది.

26. శబ్ద శాస్త్రాన్నిచ్చిన చరిత్రకారులెవరు?

జ. మహర్షి పతంజలి, మహర్షి పాణిని, మహర్షి కాత్యాయనుడు.

27. పతంజలి మహర్షి ఇచ్చిన 3 శాస్త్రములు ఏమిటి?

జ. శబ్ద శాస్త్రం, యోగ శాస్త్రం, వైద్య శాస్త్రం.

28. త్రికరణాలకు వైద్య, శబ్ద, యోగ శాస్త్రములకు గల సంబంధం ఏమిటి?

జ. త్రికరణాలు మనోవాక్కాయం. వైద్యశాస్త్రం కాయమునకు (శరీరం), శబ్ద శాస్త్రం వాక్కును, యోగ శాస్త్రం మనస్సును శుద్ధిచేస్తాయి. ఇవి పతంజలి మహర్షి ఇచ్చిన శాస్త్రములు.

29. పతంజలి చెప్పిన రాజయోగం, రాజస యోగం అంటే ఏమిటి?

జ. త్రికరణాలతో సాధన చేసినది రాజయోగం, ప్రచారసాధనంగా చేసినది రాజస యోగం అంటారు.



30. అజ్ఞానం బాగా ఉన్నవాళ్ళని ఏమంటారు?

జ. అడ్డ గాడిద అంటే వెన్నెముక అడ్డంగా ఉన్న జంతువు లక్షణం ఉన్నవాడు.

31. సూత్రం అనగా నేమి?

జ. జ్ఞానాన్ని క్లుప్తంగా, ఘూఢంగా విషయం వివరించుట సూత్రం అంటారు. సూత్ర విస్తరణ సంపూర్ణ విషయాన్ని తెలుపుతుంది.

32.నందికేశ్వర కాశికలు (మహేశ్వర సూత్రములను) శివుడు ఎలా ఇచ్చాడు?

జ. 1: శ్లోకం || నృత్తావసానే నటరాజరాజ, ననాద ఢక్కాం నవ పంచవారం

ఉద్ధార్తు కామా సనకాది సిద్ధా, నేతద్వి మహర్షే శివసూత్ర జాలం ||

విశ్వరూప విలాస, వైచిత్రి, సంస్కార, చమత్కార రూపుడు నటరాజు. సనకుడు, సనందనాది ఋషులను, సిద్ధ పురుషులనుద్ధరించుటకు శివుడు శివతాండవం చివరలో 14 సార్లు నవ + పంచ తన డమరుకమును రకరకములుగా ప్రయోగించినాడు.



33. మహేశ్వర సూత్రములలో ఉన్న మహాత్మ్యమును చెప్పిన వారెవరు ?

జ. అక్కడ ఉన్న ఋషులు సిద్ధపురుషులు డమరుక ధ్వనుల అంతరార్థం ఏమిటని నందికేశ్వరుడిని ప్రశ్నించారు. అప్పుడు నందికేశ్వరుడు ఆ సూత్రములలో ఉన్నది విశ్వవిజ్ఞాన రహస్యములు, ఉపనిషత్ సారం, వేదములు మరియు బ్రహ్మవిద్య అని తెలిపాడు.

34. మహేశ్వర సూత్రములలో ఎలాంటి ఎరుకను కలిగిస్తాయి?

జ. విశ్వమంతా పరమాత్మ అనే ఎరుక మరియు భగవంతుడు విశ్వమునకు అతీతుడు అనే ఎరుక కలిగించే విద్య నందికేశ్వర కాశికలు.

35. కాశికలు అంటే అర్థం ఏమిటి?

జ. కాశికా అంటే వెలిగించునది, తెలియజేయునది అని అర్థం. వీటిని కారికలు అనికూడా అనవచ్చు illumination.

36.అక్షరాలకు అక్షరం అనే పేరు ఎలా దర్శించారు మన ఋషులు?

జ. అక్షరం అనే పదం పలికేప్పుడు నోరుతెరిచి "అ" పలికి నాలుక నోటికుహారంలోని పై, క్రింది దవడ, కంఠానికి, మూర్ధానికి, దంతములకు తగిలి పూర్తిగా మూసుకుంటుంది. నోరు తెరిచి నోరుమూసుకొనే లోపు పలికేవన్నీ అక్షరములే.

37. వాక్కు దశలను English లో ఏమంటారు?

జ. పరావాక్కు – CONNECTIVE SPEECH, పశ్యంతి దశ – CONCIOUS LEVEL SPEECH FORMS IMAGE TO CREATE STRUCTURE, మధ్యమాదశ – INTERNAL SPEECH, వైఖరీ దశ –EXTERNAL SPEECH.

38. వాక్కు దశల దేవతలెవరు?

జ. పరావాక్కు దేవత పరమేశ్వరీ దేవత, పశ్యన్తీ దేవత బాలత్రిపుర సుందరీ దేవత, మాధ్యమా దశకు లలితా దేవి, వైఖరీ దశ దేవత రాజరాజేశ్వరీ దేవి.

39.పరావాక్కును నిర్వచించండి?

జ. పరావాక్కు – మాట్లాడాలనే సంకల్పం కలగగానే నాదరూపమైన శబ్దం పుట్టి, చైతన్య రూపమైన వాక్కు ప్రేరేపింపబడి సహస్రారంలో ప్రారంభమై వెగముగా మూలాధారంలోకి పడుతుంది. ఆ నాదరూప వాక్కును పరాదశ అంటారు.

40. పశ్యంతి దశను నిర్వచించండి?

జ. పశ్యంతి దశ – పరాదశలోని వాక్కును మనస్సు అందుకొని భావరూపం దాలుస్తుంది. దానిని పశ్యంతి దశ అంటారు. పాణిని మహర్షి అష్టాధ్యాయ సూత్రాల్లో అంటారు. మనస్సు

ప్రాణశక్తితో కలసి ఉదరములోకి ప్రవేశించి ఉదరవేడి + ప్రాణశక్తి సంకల్ప బలంతో కలసి శబ్దంగా మారుతుంది. మన అంతఃకరణమైన మనస్సుతో శబ్దం కలిసిపోతుంది.

41.మధ్యమాదశ వాక్కు నిర్వచనం?

జ. మధ్యమాదశ – INTERNAL SPEECH- మనస్సు అందుకొన్న నాద వాక్కు, పూర్వజ్ఞానం వల్ల చైతన్యం పొంది భాష, అక్షరములను ఎంచు కొంటుంది. దీనిని మధ్యమా దశ అంటారు.

42. వైఖరీ దశ నిర్వచనం ఏమిటి?

జ. వైఖరీ దశ – EXTERNAL SPEECH- కంఠము నుండి బయలుదేరిన వాక్కు బయటకు నోటికుహరము ద్వారా మాట వ్యక్తమవుతోంది. ఈ దశను వైఖరీ దశ అంటారు.

## కుండలినీ దేవతలు, అక్షర దేవతలు

43. వర్ణ సమాన్వాయవిద్య కు మరో పేరు ఏమిటి?

జ. నారాయణ విద్య లేదా నంది విద్య.

44. వర్ణ సమాన్వాయము అని వేటిని అంటారు?

జ. అక్షరములు భగవంతుడి నామాలు. వర్ణం అంటే జాతి, రంగు, అక్షరం అని పేరు. అందుకు అక్షరములను వర్ణ సమాన్వాయము అని అంటారు.


45. అక్షర విద్య, నామ విద్య ఇచ్చిన ప్రధమ ఆచార్యుడెవరు?

జ. వర్ణ సమామ్నాయ విద్య (నామ విద్య or నారాయణ విద్య) ఇచ్చినది ఆచార్య

నందీశ్వరుడు. నామ విద్య అంటే 50 అక్షరముల 50 భగవతీదేవి నామములు.

46. ||నామపారాయణప్రీతా నందివిద్యా నటేశ్వరీ||141|| లలిత సహస్ర నామములలోని నంది విద్య అనగానేమి?

జ. అక్షరములను పారాయణ చేయడమే నంది విద్య. ఎలాగంటే అ + క + లలిత నామం ఇలా  చదవడం లో కొన్ని వేల సంఖ్య లో అమ్మవారి నామాలు వస్తాయి. అది నందివిద్య (26,000 నామాలు).




47. కుండలినిలో డాకినీశ్వరీ దేవి స్థానం ఏది?

జ. డాకినీశ్వరీ దేవి 16 దళముల పద్మంలో ఉంటుంది. ఇవి 16 అచ్చులు కంఠస్థానం. ఆకాశ తత్త్వం, విశుద్ధ చక్ర స్థానం.

48.కుండలినిలో రాకిణిదేవి స్థానం ఏది?

జ. ఈ రాకిణి దేవి 12 అక్షరా అక్షరముల దేవత క కారం నుండి ఠ కారం వరకు. హృదయ స్థానం. క ఖ గ ఘ ఙ ,చ ఛ జ ఝ ఞ ట ఠ. వాయుతత్త్వం. అనాహత చక్ర స్థానం.

49. కుండలినిలో లాకినిదేవి స్థానం ఏది?

జ. ఈ తల్లి 10 అక్షరముల దేవత ఈ తల్లి పేరు లాకినిదేవి. నాభి స్థానం. డ ఢ ణ త థ ద ధ న ప ఫ. అగ్ని తత్త్వం. మణిపూర చక్ర స్థానం.

50. కుండలినిలో కాకినీశ్వరీ  దేవి స్థానం ఏది?

జ. ఈ దేవి పేరు కాకినీ దేవి. ఈ తల్లి 6 అక్షరములకు దేవత.  బ భ మ య ర ల.

జలతత్త్వం.  స్వాధిష్ఠాన చక్ర స్థానం.

51. కుండలినిలో సాకిని దేవి స్థానం ఏది?


జ. ఈ  దేవత పేరు సాకిని. ఈ తల్లి 4 అక్షరములకు దేవత వ శ ష స. పృథ్వీ తత్త్వం.

మూలాధార చక్ర స్థానం.

52. కుండలినిలో హాకిని దేవి స్థానం ఏది?

జ. ఈ దేవత పేరు హాకిని. ఈ తల్లి 2 అక్షరముల దేవత హ(హంసవతి), క్ష (క్షమావతి).

మనః తత్త్వం. ఆజ్ఞాచక్ర స్థానం.



53. మహేశ్వర సూత్రములకు గల వివిధ నామాలను తెలుపండి?

జ. 1. ఈశ్వర విద్యా నామములను

2. ఆదిసూత్రములు

3. నందికేశ్వర కాశికలు

4. నందికేశ్వర కారికలు

5. శివసూత్రజాలం

6. మాహేశ్వర సూత్రములు

7. వర్ణ సమామ్నాయము

54. అక్షరం అంటే పతంజలి ఇచ్చిన నిర్వచనం ఏమిటి?

జ. న క్షరం విద్యతే అక్షరం – అక్షరానికి నాశనం లేదు

న క్షీయతే అక్షరం – ఏది తరిగిపోదో అది అక్షరం

నాతీతివా నక్షరం – అక్షరంకన్న అతీతమైనది లేదు.

ప్రాప్నోతి ఇతి అక్షరం – పొందించునది అక్షరం

అక్షర సమామ్నాయో వాక్, సమామ్నాయో వేదితయో బ్రహ్మ రాశి - సర్వ వేద పుణ్య ఫలితాన్ని కలగజేస్తుంది అక్షరం.

55. నందికేశ్వరుడిచ్చిన మొదటి శ్లోకం ఏది?

జ. శ్లోకం || నమశ్శివాయ దేవాయ సర్వజ్ఞాయ పరాత్మనే

యస్యోన్మేష నిమేషాభ్యాం వ్యక్తావ్యక్త మిదం జగత్ ||

ఎవరి కనురెప్ప పాటు లో సృష్టి, స్థితి, లయలు జరుగుతున్నాయో ఆ శివునికి నమస్కారం. నందికేశ్వరుడు మొట్ట మొదట పంచాక్షరితో మొదలు పెట్టారు.

56.భారత దేశ భాషల అక్షర వర్గ క్రమం ఏమిటి?

జ. అ వర్గ, క వర్గ, చ వర్గ, ట వర్గ, త వర్గ, ప వర్గ, య వర్గములు.

57. అక్షరాభ్యాసన ఉపాసన ఎలా అవుతుంది?

జ. అక్షరాన్ని దేవతా రూపంగా, మంత్రముతో సాధన చేస్తే ఉపాసన అవుతుంది.

ఉదాహరణ: అక్షమాలికోపనిషత్.

58.భారతదేశంలో అక్షర విద్య ప్రత్యేకత ఏమిటి?

జ. అక్షరములు నిత్య వ్యవహారానికి, మంత్రంగా ఉపాసించి పరమార్థాన్ని పొందే క్రమం ఒక్క భారత దేశంలోనే ఉంది.



59. నందికేశ్వరుడెవరు?

జ. శిలాదమహర్షి పుత్రుడు నంది కేశ్వరుడు. శివాంశ సంభూతుడు, అయోనిజుడు, ఎప్పుడు ఆనందంగా ఉండేవాడు.

60. అక్షరములు శివ శక్తి నారాయణ రూపాలని ఎలా చెప్పగలం?

జ. దక్ష యజ్ఞ ద్వంసం తరువాత శివుడు సతీదేవి శరీరాన్ని మోసుకొని ఉండగా విష్ణువు అమ్మవారి శరీరాంగములను ఖండింపగా అవి 50 అక్షర పీఠములయ్యాయి. అందుకు అక్షరములు శివ శక్తి నారాయణ రూపాలు.

61. దక్ష యజ్ఞ కథ సంకేతం ఏమిటి?

జ. శివుడి ద్వారా ఆధారం చేసుకొని ఉన్న శక్తి, విష్ణువు చేత 50 అక్షర శక్తి పీఠములుగా వ్యాపించినది కావునా అక్షరములు శివ శక్తి నారాయణ స్వరూపములు.

62. మహేశ్వర సూత్రాలకు మొట్టమొదట భాష్యం, మరియు విస్తార భాష్యం ఎవరిచ్చారు?

జ. మహేశ్వరుడు ఇచ్చిన డమరుక శబ్దములకు నంది కేశ్వరుడు 14 సూత్రములు, 26 శ్లోకములతో మొదట భాష్యం ఇచ్చాడు. దానికి ఉపమన్యు మహర్షి గద్యరూప విస్తార భాష్యం ఇచ్చారు.

Copyright@gurujnanam.org

63. మాతృకావర్ణములు - దేవతల పేర్లు

జ. అ – అమృత , ఆ – ఆకర్షిణీ , ఇ – ఇంద్రాణీ ఈ – ఈశానీ, ఉ – ఉష్ణః కేశి,

ఊ – ఊర్ధ్వ, ఋ – ఋగ్విధ ( ఋద్ధిదా ), ౠ – ౠకారా, ఌ – ఌకార,

ౡ – ౡషా, ఏ – ఏకపద, ఐ – ఐశ్వర్య, ఓ – ఓంకార, ఔ – ఔషధ, అం – అంబిక,

అః – అఃక్షర.

క – కాళరాత్రి, ఖ – ఖాతీత,గ – గాయిత్రి ,ఘ – ఘంటాధారిణీ, ఙ – ఙమిని, చ – చంద్రా,

ఛ – ఛాయా,జ – జయ,ఝ – ఝంకారి ,ఞ – జ్ఞానరూప, ట – టంక హస్త, ఠ – ఠంకారిణి.

డ – డామరీశ్వరీ ( డామరి ), ఢ – ఢంకారిణీ, ణ – ణామిరి, త – తామసి, థ – స్థాణ్వి,

ద – దాక్షాయణి, ధ – ధాత్రి, న – నంద, ప – పార్వతి, ఫ – ఫట్కారి.

బ – బందిని, భ – భద్రకాళి,మ – మహామాయ, య – యశస్విని,ర – రమా ,ల – లంబోష్ఠి.

వ – వరదా, శ – శ్రీః ,ష – షండా ,స – సరస్వతి, హ – హంసవతి, క్ష – క్షమావతి

## అక్షరాభ్యాసం. మాహేశ్వర సూత్రములు - 1 to 4

64. మాహేశ్వర సూత్రములలో అచ్చులను సూచించే సూత్రాలు ఎన్ని మరియు అవి ఏమిటి?

జ. నాలుగు. 1. అ ఇ ఉ ణ్, 2. ఋ ఌ క్, 3. ఏ ఓ ఙ్, 4. ఐ ఔ చ్.

65. ప్రాణాక్షరాలు అని వేటికి పేరు?

జ. అచ్చులకు.

66. ప్రతి సూత్రము ఎన్ని భాగాలుగా విభజించబడింది మరియు అవి ఏమిటి?

జ. రెండు 1. అక్షరము, 2. ఇత్ (పొల్లు).

67. అచ్చులకు ఆ పేరు ఎలా వచ్చింది?

జ. మొదటి సూత్రములోని మొదటి అక్షరము (అ) మరియు నాల్గవ సూత్రములోని ఆఖరిది అయిన పొల్లు (చ్) కలపి అచ్ (అచ్చులు) అయినది.

68. 'అ' 'ఇ' 'ఉ' కారములు వేనిని సూచించుచున్నవి?

జ. 'అ' -- నిర్గుణుడు నిరాకారుడు జ్ఞానస్వరూపుడు అయిన పరబ్రహ్మ. 'ఇ' -- శక్తి. 'ఉ' -- విష్ణువును సూచించుచున్నవి.

69. ఋ ఌ కారములు వేనిని సూచించుచున్నవి?

జ. పరబ్రహ్మ -- ఋ, ఆయనకు అభిన్నమైన శక్తి -- ఌ సూచించుచున్నవి.

70. ఏ ఓ అక్షరములు ఎలా ఏర్పడ్డాయి?

జ. అ + ఇ -- ఏ, అ + ఉ -- ఓ అక్షరములు ఏర్పడ్డాయి.

71. ఏ ఓ ఙ్ సూత్రము ఏమి సూచించుచున్నది?

జ. జగదీశ్వర సమన్వయమును.

72. అక్షరముల మూలం ఎవరు?

జ. అక్షరములన్నీ అ కారము నుండి వచ్చాయి 'అ' కారము పరబ్రహ్మ నుండి వచ్చింది.

73. పరబ్రహ్మకు శక్తికి విష్ణువుకు గల సంబంధం ఏమిటి?

జ. వాటికి అభేదము, ఒక దానితో ఒకటి కలిసి ఉన్నాయి.

74. 'ఋ' 'ౠ' కారములుకు గల ఇతర పేర్లు ఏమిటి?

జ. షండాక్షరములు, నపుంసక అక్షరములు, క్లీబాక్షరములు.

75. ఐ ఔ అక్షరములు ఎలా ఏర్పడ్డాయి?

జ. అ + ఈ -- ఐ

ఆ +ఊ -- ఔ అక్షరములు ఏర్పడ్డాయి.

76. 'ఐ' కారము దేనిని సూచించుచున్నది?

జ. సంప్రజ్ఞాన ఈశ్వరశక్తిని సూచించుచున్నది.

77. అచ్చులలోని సప్తమాతృకలు ఏవి?

జ. అ ఇ ఉ ఋ ఌ అం అః.

78. అక్షరములు ఆగమములకు సంబంధము ఉన్నదా?

జ. ఉన్నది, ఆగమములు అన్నీ అక్షరములకు న్యాసం చేసి ఉపాసించమని నిర్దేశిస్తున్నాయి.

79. అచ్చులన్నీ ఏ యోగచక్రము నందుయున్నవి?

జ. విశుద్ధి చక్రము.

80. అచ్చులకు శక్తికీ గల సంబంధం ఏమిటి?

జ. అచ్చులు శక్తి అక్షరాలు.

81. అక్షరములు ఏ యోగచక్రము నుండి వైఖరిగా బయటపడునని తెలిపారు?

జ. విశుద్ధి చక్రము.

82. ||జన్మాద్య స్య యతః|| అని సూచించే మహేశ్వర సూత్రం ఏది?

జ. మొదటి సూత్ర మూడక్షరాలలో (అ ఇ ఉ) సర్వ ప్రపంచానికి సర్వ అక్షరాలకు మూలమైన తత్త్వం ఉంది. సృష్టి స్థితి లయ ఎవరి వల్ల జరుగుతున్నాయో అతడే పరమాత్మ. అదే ఆత్మ తత్త్వం. అంటే పరమాత్మ - శక్తి –ప్రపంచం. అ కారో బ్రహ్మాము, ఇ కారో మాయ పరమేశ్వరుడి శక్తిని తెలుపుతుంది, ఉ కారం ప్రపంచ వ్యాపకత్వం తెలుపుతుంది.

83. రెండవ సూత్రం - ఋ ఌ క్: దేనిని తెలుపును?

జ. "ఋ" పరమేశ్వరుడిని "ఌ" మాయను తెలియజేస్తుంది. ఇంద్రజాలికుడు ఇంద్రజాలం సృష్టించి నట్లు, పరమేశ్వరుడు జగత్తును సృష్టించాడు. పరమేశ్వరుడు ప్రపంచాన్ని సృష్టించాడు. ఇంద్రజాలికుడు సత్యము. అందుకు ఋ పరమాత్మ "ఌ" మాయ శక్తి. "ఋ", "ఌ" శండాక్షరములు, అంటే నపుంసక అక్షరాలు (క్లీభాక్షరములు). ఇలా "ఋ" "ఌ"లకు ఉత్పత్తి సమర్థత లేదు. ఇవి వ్యాప్తి, పరిణామం చెందలేవు.

84. మూడవ సూత్రం - ఏ ఓ ఙ్: నిర్వచనం ఏమిటి?

జ. ఈ జగత్తుకు కారణం, జనకుడు పరమేశ్వరుడు. నిమిత్తం, ఉపాదానం రెండు పరమేశ్వరుడే.

ఈ సూత్రం జగదీశ్వర సమన్వయాన్ని తెలుపుతుంది. అదే అద్వైతము.

అ +ఇ =ఏ & అ +ఉ =ఓ  "ఇ" ఇచ్ఛాశక్తి, "ఉ" వ్యాపకుడు "అ" అయిన పరమాత్మను వదిలిలేవు. ఉన్నది ఒక్కటే అద్వైతము.

85. నాలుగవ సూత్రం - ఐ ఔ చ్: నిర్వచనం ఏమిటి?

జ. "ఐ" అమ్మవారి వాగ్భవ బీజం. ఐ కి నాదం జోడిస్తే "ఐం". దేవీభాగవతంలో ఐం బీజం గూర్చి విపులంగా చెప్పాడు. ఐం అంటే శబ్ధ శక్తి sound energy. ఆ+ఈ =ఐ అంటే దీర్ఘం ఎప్పుడు విస్తారానికి ప్రతీక. ఇచ్ఛా శక్తి "ఇ" జ్ఞాన శక్తి "ఐ" గా విస్తరించింది. ఆ+ఊ=ఔ "ఓ" ఓంకారమును తెలుపుతుంది. ఓ యొక్క వ్యాపకత్వం ఔ  ఓం కారాన్ని తెలియజేస్తుంది. కావున జ్ఞానశక్తి  పరమాత్మా(ఐం), జ్ఞాన శక్తి (ఔ) ప్రణవాత్మక వ్యాపకత్వంచే జగత్తుతో కలసి ఉన్నాడు.



## మాహేశ్వర సూత్రములు - 5, to 14 సూత్రములు హల్లులు,

## దృశ్యమానజగత్

86. ఐదవ సూత్రం - హ య వ ర ట్: & సూత్రం ఆరు - ల ణ్: వేటిని తెలుపుతున్నవి?
జ. వ్యక్తమైన జగత్తు పంచభూతములు. పంచ అంటే విస్తారము అని అర్థం. ఈ పంచ తత్త్వములు జగత్తుగా పరిణత చెందినది. హ య వ ర ల ఈ పంచాక్షరములు పంచభూతములను తెలుపుతున్నవి. పంచభూతములలో అక్షర శక్తి దాగి ఉన్నది. హ - ఆకాశం, య - వాయు, ర - అగ్నితేజస్, వ – జలం, ల – పృధ్వీ తత్త్వాలను తెలుపుతాయి. ఇవి శివుడి వాక్కులు.

87. లలిత సహస్రనామములలోని పంచోచ్చారణ అక్షరములకు గల అనుబంధం ఏమిటి?
జ. నిత్యానుష్ఠానపరులు పంచోపచారములు చేస్తారు. లం - పృథ్వీ తత్త్వం, హం - ఆకాశ తత్త్వం, యం - వాయు తత్త్వం, రం - వహ్ని తత్త్వం, వం - అమృత జల తత్త్వం, అనే క్రమంలో చేస్తారు.
హ య వ ర ల అక్షరములకు అం నాదమును జోడించి బీజాక్షరమును న్యాసం చేస్తే శబ్దశక్తి తరంగాలేర్పడి ప్రకృతి దేవతల అనుగ్రహం లభిస్తుంది.

88. సూత్రం ఆరు - ల ణ్: విడిగా ఎందుకు చెప్పారు?
జ. నాలుగు భూతములకు ఆధారం పృథ్వీ "లం". మానవులకు ఆధార భూతం "లం". భూమి అన్ని లోకాలకు ఆధారం. జీవుల ఉత్పత్తికి కారణం అన్నం. అన్నానికి కారణం భూమి. పంచ అంటే విస్తారము అని కూడా అర్థం ఉంది. మానవుడి శరీరంలో పంచ వ్రేళ్ళు అది ఒకానొక తత్త్వం. కావున పురుషుడు పూర్ణుడు.

89. అన్ని శాస్త్రముల సారం, ఉపనిషదులసారం ఏ వాక్యంలో ఉంది?

జ. ||సర్వం బ్రహ్మ మయం జగత్తు ||

90. ఆగమాల్లోని, మహేశ్వర సూత్రాల్లోని అక్షర క్రమం ఎలా ఉంది?



జ. మహేశ్వర క్రమం విశ్వదర్శన క్రమం, మహేశ్వర సూత్రాల్లో ఉంది. మంత్ర శాస్త్రంలో విస్తరించిన మాతృకావర్ణముల క్రమం ఆగమాల్లో ఉంది. అంటే బ్రహ్మ జ్ఞానాన్ని చెపుతుంది మహేశ్వర సూత్రములు. మంత్ర జ్ఞానాన్ని చెప్పుతున్నది అక్షర విద్య. రెండు కలిపితే అక్షరాభ్యాసం.

91. సూత్రం ఏడు - ఞ మ ఙ ణ నం: వేటిని తెలుపుతుంది?

జ. పంచభూత గుణములను ఞ మ ఙ ణ నం: చెపుతుంది. ఇవి చ వర్గ, ప వర్గ, క వర్గ, ట వర్గ, త వర్గ చివరి అక్షరములు. ఈ పంచాక్షరములు (ఞ మ ఙ ణ నం) పంచతన్మాత్రలైన శబ్ధ స్పర్శ రూప, రస, గంధములను తెలియజేస్తున్నాయి.

92.7. 8, 9, సూత్రములలోని అక్షరములు ఏవి? అవి వేటిని తెలియ చేస్తాయి?

జ. ఎనిమిదవ సూత్రం -ఝ భ ఞ్: సూత్రం తొమ్మిది - ఘ ఢ ధ ష్:

వాక్ (ఝ), పాణి (భ) ఈ రెండు, వాక్కును మరియు చైతన్యవంతమైన పని చేయు చేతిని తెలియజేస్తున్నాయి. కర్మేంద్రియములను ఘ ఢ ధ ష్ తెలియజేస్తున్నాయి. ఇవి మహా ప్రాణాక్షరములు. పాదములు (ఘ) feet, పాయువు (విసర్జనేద్రియం) anus (ఢ), ఉపస్థ (జనేంద్రియం) reproduction organ (ధ ష్).

93. సూత్రం పది - జ బ గ డ ద శ్: దేనిని తెలియచేస్తుంది?

జ. ఈ 5 అక్షరములు (జ బ గ డ ద శ్) పంచ జ్ఞానేంద్రియములను తెలియజేస్తున్నవి జ - త్వక్ చర్మం, బ - జివ్హా రుచి, గ - చెవి శ్రవణం, డ - చక్షుహు చూపు, ద శ్ - ముక్కు గంధం.

94. సూత్రం పదకొండు - ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్: ఇవి వేటిని తెలుపును?

జ. ఖ - ప్రాణవాయువు, ఫ - అపానవాయువు, ఛ - వ్యానవాయువు, ఠ - ఉదానవాయువు, థ - సమాన వాయువు, పంచ ప్రాణములు వత్తు అక్షరములు, అంతఃకరణములు వత్తులు లేని అక్షరములు. మనస్సు, బుద్ధి, అహం చ ట త వ్ లు తెలుపుతున్నవి.

95.సూత్రం పన్నెండు - క ప య్: దేనిని తెలుపును?

జ. "క" ప్రకృతిని, ''ప'' పురుషుడిని తెలియజేస్తుంది. సృష్టిచేయడానికి పరమాత్మ శక్తిని వ్యాపింప చేస్తున్నాడు. కనుక ప్రకృతి క్షేత్రముగా, పరమాత్మ పురుషుడిగా చెప్పబడుచున్నది.

96. అక్షరములకు బ్రహ్మమునకు గల సంబంధం ఎలాంటిది?

జ. బ్రహ్మసూత్రములు బ్రహ్మమును, మహేశ్వర సూత్రములు మహేశ్వరుడుని తెలియచేస్తుంది. అంటే మహేశ్వరుడు బ్రహ్మము (అక్షర బ్రహ్మం మహేశ్వరుడు).

97. పిల్లలకు మహేశ్వర సూత్రములు కంఠస్తం చేయుట వలన లాభ మేమి?

జ. శివుడు వేదము చెప్పిన బ్రహ్మ జ్ఞానమును సూత్రీకరించి అక్షరాలను చెప్పాడు. కనుక ఇవి సర్వ వేద పుణ్య ఫలములనిచ్చును.

98. సూత్రం పదమూడు - శ ష స ర్: & పద్నాలుగవ సూత్రం - హ ల్ దేనిని తెలుపును?

జ. "శ" కారం రాజసగుణం, "ష" కారం తామసగుణం, "స" కారం సత్వగుణం, హల్ తత్వాతీతుడైన పరమేశ్వరుడిని మరియు అహం ఆత్మ అని తెలియచేస్తుంది.

99. 33 ప్రకృతి తత్త్వ జగత్తు, అక్షర తత్త్వ జగత్తును తెలుపుము?

జ. పంచ భూతములు + పంచ జ్ఞానేంద్రియములు + పంచ తన్మాత్రలు + పంచ కర్మేంద్రియములు + పంచ ప్రాణములు + త్రిగుణాలు + మనస్సు + అహంకారం+ బుద్ధి + ప్రకృతి + పురుషుడు = 33. ఇది 33 గా కనబడుతున్న ఒకే బ్రహ్మ తత్వము. అంటే విశ్వము బ్రహ్మమయము. దీనిని అర్థం చేసుకొంటే పరమాత్మ విశ్వాతీతుడని ఎరుక కలుగుతుంది. 33 తత్త్వములకు 14 సూత్రాల్లో 33 అక్షరములున్నవి.

100. "సర్వాను గ్రహ విగ్రహః" అని పరమేశ్వరుడిని ఎందుకు చెపుతాము?



జ. అనుగ్రహం అంటే అనుసరించి గ్రహించుట అని అర్థం. ప్రకృతి నుండి ప్రపంచం. ప్రపంచం నుండి సుఖ దుఃఖాలు కలుగుతున్నవి. అంటే సుఖం దుఃఖం పరమేశ్వరుడిచ్చినవే. మనలను పరమేశ్వరుడు అనుసరించి, గ్రహించి కర్మ ఫలాలను అనుగ్రహిస్తున్నాడు. కర్మలను అనుసరించి కష్టాలు సుఖాలు ఇచ్చుటకు విగ్రహుడైనాడు.

101. ఏ పద జాలాలను శివుడు పలికి అదృశ్య మయ్యాడు?

జ. శ్లోకం ||తత్వాతీతః పరః సాక్షీ సర్వనుగ్రహవిగ్రహః, అహమాత్మా పరో హల్ స్వాదితి శంభు శిరోదధే||

సర్వానుగ్రహ విగ్రహుడైన పరమాత్మ సర్వాతీతుడు, సాక్షీ భూతుడు, నేనే పరమాత్మను శంభుడను అని హల్ మ్రోగించి అంతర్ధానమయ్యాడు.

102. హల్లులు దేనిని తెలియ చేస్తాయి?

జ. దృశ్యమాన జగత్తును.

103. 5వ, 6వ సూత్రములలో అక్షరములు ఏమిటి?

జ. హ, య, వ, ర, ట్ - ల ణ్.

104. మానవుడిని పరిపూర్ణుడు అని ఎందుకన్నారు?

జ.  మిగతా జీవుల కన్నా పూర్ణత్వం ఉంది కనుక. |పుర్ణత్వాత్ ఇతి పురుషః |

105. ఏడవ సూత్రములో అక్షరములు ఏవి?

జ. ఞ మ ఙ ణ నం.

106. ఏడవ సూత్రములోని అక్షరములు దేనిని  సూచిస్తున్నాయి?

జ. పంచ తన్మాత్రములను తెలియజేస్తాయి.

107. స్పర్శ అక్షరములని వేటిని అంటారు?

జ. ప, ఫ, బ, భ, మ.

108. మహా ప్రాణాలని వేటిని అంటారు?

జ. ఒత్తులు ఉన్న అక్షరాలను మహా ప్రాణాలంటారు.

109. హంస అంటే ఏమిటి?

జ. హ కారము శివుడు, స కారం శక్తి  కలిపితే హంస.

110. హిరణ్యం అంటే ఏమిటి అని వర్ణించారు?

జ. హితం. ఆనందం, అదే రమ్యం -- హిరమ్యం అంటే హిరణ్యం.

## మాతృకావర్ణములు

111. అక్షరాలను అమ్మ గా ఉపాసించే వర్ణ క్రమము ఏది?

జ. మాతృకావర్ణములు.

112. మాతృకావర్ణములు ఎలా ఉంటాయి?

జ. "అ" వర్గ, "క" వర్గ, "చ" వర్గ, "ట" వర్గ, "త" వర్గ, "ప" వర్గ రూపాలతో ఉంటాయి.

113. మాహేశ్వర సూత్రముల క్రమము, మాతృకావర్ణముల క్రమము దేనిని తెలియజేస్తున్నాయి?

జ. విశ్వ జ్ఞానం చెప్పడానికి మాహేశ్వర సూత్రముల అక్షర క్రమము, ఉపాసనా పద్ధతి చెప్పడానికి మాతృకావర్ణముల అక్షర క్రమము వచ్చాయి.

114.ఒక్కో అక్షరానికి ఒక్కో కాంతి ఉన్నప్పుడు అన్ని (50) అక్షర వర్ణములు కలుపగా వచ్చే కాంతి ఏది?

జ. తెలుపు కాంతి (సర్వ శుక్లా సరస్వతీ).



115. మాతృకావర్ణ రూపిణీ అంటే?

జ. 50 అక్షరముల అమ్మ ఏక రూపమే మాతృకావర్ణ రూపిణి.

116. మాతృకా సరస్వతి కి మరో పేరు?

జ. పంచాశత్ వర్ణ విగ్రహ - 50 అక్షరముల శారదా రూపము.

117. మాతృకా సరస్వతి వర్ణనలో అచ్చులు, హల్లులు ఎక్కడ ఉంటాయని చెప్పారు?

జ. అచ్చులు - అమ్మయొక్క శిరస్సు లో ఉంటాయి.

హల్లులు - అమ్మయొక్క మిగతా భాగాలలో ఉంటాయి.

118. శారదమ్మ శిరస్సు పై ఉన్న చంద్రకళ దేనిని తెలియచేస్తుంది?

జ. అమ్మ పై ఉన్న చంద్రకళ తురీయ తత్త్వాన్ని తెలియజేస్తుంది.

119. ప్రాణాక్షరములు, ప్రాణ్యాక్షరములు అని వేటిని అంటారు, ఎందుకు ఆ పేర్లు వచ్చాయి?

జ. ప్రాణాక్షరములు - అచ్చులు

ప్రాణ్యాక్షరములు - హల్లులు

అచ్చుల కలయిక లేనిదే హల్లులను పలకలేము, ప్రాణం లేకపోతే ప్రాణి లేదు.

అందుకు వీటిని ప్రాణాక్షరములు, ప్రాణ్యాక్షరములు అంటారు.

Copyright@gurujnanam.org

120.పంచాశత్ వర్ణ విగ్రహాను వర్ణించండి?

జ. **అచ్చులు** :

"అ" కారం - శిరస్సు

"ఆ" కారం - నోటియందు

"ఇ" కారం - కుడి కన్ను

"ఈ" కారం - ఎడమ కన్ను

"ఉ" కారం - కుడి చెవి

"ఊ" కారం - ఎడమ చెవి

"ఋ" కారం - కుడి చెక్కిలి

"ౠ" కారం - ఎడమ చెక్కిలి

"ఌ","ౡ" - నాసికలు

"ఏ" - పై పెదవి

"ఐ" - కింది పెదవి

"ఓ","ఔ" - దంతములు

"అం" - నాలుక లోపలి భాగం

"అ:" - కంఠం చివరి భాగం

**హల్లులు** :

"క" వర్గం కుడి చేతిలో

"చ" వర్గం ఎడమ చేతిలో

"ట" వర్గం కుడి పాదములో

"త" వర్గం ఎడమ పాదములో

"ప,ఫ" లు పార్శ్వములు

"బ" కారం - వెనక భాగం

"భ" కారం - నాభి భాగం

"మ" కారం - ఉదర భాగం

"య" కారం - హృదయ భాగం



Copyright@gurujnanam.org

"ర" కారం - బాహు మూలం

121.అక్షమాల, అమృత కలశం పట్టుకున్న శారదా దేవి మరో రూపం?

జ. త్రిపుర సుందరి రూపం. త్రిపుర సుందరి అక్షరాకృతిని ధ్యానిస్తే, ఆవిడే శారదా దేవి.

122.త్రిపుర సుందరి దండకమును ఎవరు రచించారు?

జ. దీపక నాథుడు త్రిపుర సుందరి దండకంను రచించారు.

123. దీపక నాథుడి నామము ఏ స్తోత్రం లో ఒక గురుగా చెప్పారు?

జ. శుద్ధ శక్తి మాల (ఖడ్గమాలా స్తోత్రం అనకూడదు, "శుద్ధ శక్తి మాల" అనాలి).

14. శ్యామలా దండకం ఎవరు రచించారు?

జ. శ్యామలా దండకమును కాళిదాసు మహా కవి రచించారు.

124. త్రిపుర సుందరి దండకము లో అక్షరములను ఎలా జపించాలన్నారు, దాని ఫలం?

జ. గురువు ద్వారా ఏ అక్షరమునకు ఏ దేవతా రూపమో గ్రహించి, ఉపదేశం పొంది జపిస్తే అది పరమార్ధమును ఇచ్చును.

125.మూక కవి కి అక్షర రూపం గా దర్శనమిచ్చిన తల్లి ?

జ. కామాక్షి దేవి.

126. ఏకాదశ రుద్ర సంఖ్యగా అక్షరములని అమ్మ రూపం గా త్రిపుర సుందరి దండకములో ఎలా చెప్పారు?

జ. రుద్రాత్మికమైన త్రిపుర సుందరి రూపం.

1) అ ఇ ఉ ఋ ఌ
2) ఏ ఐ ఓ ఔ
3) అం అ:
4) క వర్గం
5) చ వర్గం
6) ట వర్గం
7) త వర్గం
8) ప వర్గం
9) య వర్గం
10) శ ష స హ
11) ళ క్ష

127. మాతృకావర్ణములను పలుకుతున్నప్పుడు అమ్మవారిని ఎలా ధ్యానించాలని త్రిపుర సుందరి దండకం లో వివరించారు?

జ. చంద్రకాంతి శిలలా తెల్లని చల్లని వెన్నెలను వెదజల్లుతున్న అమ్మ యొక్క స్వరూపాన్ని భావిస్తూ ఉంటే, తల్లి ఆ రూపం ధరించి చిరు నవ్వు నవ్వుతూ, వెలిగిపోతూ, ఎప్పుడూ పద్మవనం లో కూర్చుంటుంది. అనగా, మూలధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉండే 6 పద్మాలు, సహస్రారం లో ఉండే మహా పద్మములను కమల భవనం అని. అందులో ఉండే అక్షారాలు గా అమ్మను వర్ణించారు.

128.అక్షర రూపిణి అయిన అమ్మవారిని ఉపాసిస్తే ఫలం ఏమిటి?

జ. సంసారాన్ని భేదించి మోక్షమునకు కావలసిన జ్ఞానాన్ని ఇస్తుంది, భయమును పోగొడుతుంది. సర్వసిద్ధి పొందుతారు.

129.భువనేశ్వరి నామాన్ని వివరించండి?

జ. అక్షర రూపంతోనే మొత్తం జగం వ్యాపించింది కాబట్టే భువనేశ్వరి.

130.మాహేశ్వర సూత్రముల ద్వారా, మాతృకావర్ణముల ద్వార ఏమి తెలుసుకున్నాము?

జ. శివ శక్తి రూపములే అక్షరములు.

131. అక్షరాలు సిద్ధిస్తే ఏమి ఫలం?

జ. చతుర్దశ భువనాలలో ఉండే ప్రకృతి శక్తులను మించిన శక్తులు వస్తాయి. అమ్మవారి చరణ కమలముల వద్దకి వెళ్తారు. సర్వ సిద్ధులు పొందుతారు.

132. మాతృకా కోశాన్ని రచించిన వారు ఎవరు, కోశం అనగా ఏమి?

జ. మహీదాసుడు మంత్ర శాస్త్రం లో "మాతృకా కోశం" రచించారు. కోశం అనగా నిఘంటువు(డిక్షనరీ).

133.మహీదాసుడు మాతృకా కోశం లో ఏమి వివరించాడు?

జ. ఒక్కొక్క మాతృకలో ఏ ఏ శక్తులుంటాయో వివరిస్తూ, పంచభూతాలకి సంబంధించిన అక్షరములను వివరించారు.

వాయు వర్ణములు - "అ ఆ ఏ క చ ట త ప య ష"

అగ్ని వర్ణములు - "ఇ ఈ ఐ ఖ ఛ ఠ థ ఫ ర క్ష"

పృథ్వీ వర్ణములు - "ఉ ఊ ఓ గ జ డ ద బ ల అ."

జల వర్ణములు - "ఋ ౠ ఔ ఘ ఝ ఢ ధ భ వ స"

ఆకాశ వర్ణములు - "ఇ ఈ అం ఐం ఞ ణ న మ శ హ"

134.వహ్ని అనగా?

జ. యజ్ఞాగ్నిని వహ్ని అంటారు.

135.భూత భీజములు చెప్పే వర్ణములు ఏవి?

జ. హ య వ ర ల - భీజ వర్ణములు.

136.ఏకాక్షరీ కోశం లో ఏమి చెప్పారు?

జ. శ్రీ విద్య లో చెప్పబడిన అక్షర దేవతలు కాకుండా, 50 అక్షరములకి దేవతలని చెప్పారు.

137.అక్షరములలో పంచకృచ్ఛ కళలు ఏవి, వాటి వివరణ?

జ. సృష్టికి సంబందించిన కళలు

బ్రహ్మ కళలు - "క","చ" వర్గములు

విష్ణు కళలు - "ట","త" వర్గములు

రుద్ర కళలు - "ప" నుండి "ష"

ఈశ్వర కళలు - శ స హ క్ష

సదాశివ కళలు - "అ" నుండి "చ" వరకు (మాహేశ్వర సూత్రములోని - అచ్చులు)

138. అక్షమాలికోపనిషత్ లో ఏమి చెప్పారు?

జ. అక్షమాలిక ఉపనిషత్ లో గురుమండల రూపిణి ని "అ" నుండి "క్ష" వరకు అనుకోవడమే మాళినీ మంత్రం గా వివరించారు. అక్షమాలికోపనిషత్ లో ఏ అక్షరం పలికితే ఏమి సిద్ధి వస్తుందని చెప్పారు.

139. ధ్యాన బిందు ఉపనిషత్ చెప్పిన రహస్యం?

జ. " హ య వ ర ల " బీజాక్షరములకి ఏ దేవత ఏ రంగులో ఉంటుందో చెప్పింది.

***************** అక్షమాలికోపనిషత్ లో అక్షర, ఫల, స్వరూప వివరణ *********

| | | |
|---|---|---|
| అం | మృత్యుంజయ: | సర్వవ్యాపక: |
| ఆం | ఆకర్షణత్మక | సర్వగత: |
| ఇం | పుష్టిద: | క్షోభకర: |
| ఈం | వాక్ ప్రసాదకర: | నిర్మల: |
| ఉం | సర్వ బలప్రద: | సార: |
| ఊం | తీవ్రతర: | దుష్ట శక్తులను లేపుతుంది |
| ఋం | సంక్షోభకర: | చంచల: |
| ౠం | సమ్మోహనకర: | ఉజ్జ్వల: |
| ఌం | విద్వేశనకర: | మోహక: |
| ౡం | మోహకర: | మోహకర: |
| ఏం | సర్వ వశ్యకర: | శుద్ధ సత్త్వం |
| ఐం | శుద్ధ సాత్త్విక: | పురుషవశ్యకర : |
| ఓం | అఖిల వాగ్మయ: | నిత్యశుద్ధ: |
| ఔం | సర్వ వాగ్మయ: | వశ్యకర: |
| అం | గజాది వశ్యకర: | ఏనుగులని లాగగల |

| | | |
|---|---|---|
| అ: | మృత్యునాశనకర: | రౌద్ర: |
| కం | సర్వ విషహర: | కళ్యాణదా |
| ఖం | సర్వక్షోభకర: | వ్యాపక: |
| గం | సర్వ విఘ్న శమన: | మహత్తర: |
| ఘం | సౌభాగ్య ప్రద: | స్తంభనకర: |
| ఙం | సర్వ విషనాశకర: | ఉగ్ర: |
| చం | అభిచారఘ్న: | క్రూర: |
| ఛం | భయనాశక: | భయంకరంగా ఉంటుంది |
| జం | కృత్యాదినాశకర: | భీషన: |
| ఝం | భూతనాశకర: | భూతనాశకర: |
| ఞం | మృత్యు ప్రమదన: | మృత్యు ప్రమదన: |
| టం | సర్వ వ్యాది హర: | శుభగ: |
| ఠం | చంద్ర రూప: | సౌమ్య: |
| డం | గరుడాత్మక: | విషఘ్న: శోభన: |
| ఢం | సర్వ సంపత్ ప్రద: | సర్వ సంపదలు కలుగును |
| ణం | సర్వ సిద్ధి ప్రద: | సర్వ సిద్ధులు |
| తం | ధన ధాన్యాది సంపత్ ప్రద: | ప్రసన్న: |
| థం | సర్వప్రాప్తికర: | నిర్మల: |
| దం | పుష్టి వృద్ధికర: | ప్రియదర్శన: |
| ధం | విషజ్వరఘ్న: | విపుల: |
| నం | భుక్తి ముక్తి ప్రద: | శాంత: |
| పం | విష విఘ్న నాశన: | భవ్య: |
| ఫం | అనిమాది సిద్ధి ప్రద: | జ్యోతీ రూప: |
| బం | సర్వ దోష హర: | శోభన: |
| భం | భూత ప్రశాంతికర: | భయానక: |
| మం | విద్వేశి మోహనకర: | విద్వేశి మోహనకర: |

| | | |
|---|---|---|
| యం | సర్వ వ్యాపక: | పావన: |
| రం | దాహకర: | వికృత: |
| లం | విశ్వంభర: | భాసుర: |
| వం | సర్వ ఆప్యాయనకర: | నిర్మల: |
| శం | సర్వ ఫల ప్రద: | పవిత్ర: |
| షం | ధర్మ అర్థ కామద: | ధవళ: |
| సం | సర్వ కారణ: | సార్వవర్ణక: |
| హం | సర్వ వాఙ్మయ: | నిర్మల: |
| ళం | సర్వ ప్రద: | శక్తి ప్రధాన: |
| క్షం | పరాపర తత్త్వ జ్ఞాపక: | పరం జ్యోతీ రూప: |

****************************************************************************


## శ్రీ గురువు గారి ఆశీస్సులతో

### Contributors of Aksharaabhyaasam –Sept 2019

| | | |
|---|---|---|
| 1 | Santhi Akella | CA |
| 2 | Srinivas Timmaraju | TN |
| 3 | Tejas Bharadwaj | Bharath |
| 4 | Venkatesh Ghantasala | NC |
| 5 | Rajeswari Pusuluri | NC |
| 6 | Srujana Budde | MD |

Formatting and Editing By Srujana Budde and Shiva Rani Induthy Proof reading by ShivaramaKrishna Chintalapati Garu

సర్వం శ్రీకృష్ణచరణారవిందార్పణమస్తు



Copyright@gurujnanam.org